క్లుప్తంగా

పాలిటెక్నిక్ కళాశాల తనిఖీ



హన్మకొండ (పరకాల) : పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను గురువారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆయన.. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, గదులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను, కోర్సుల వివరాలను తెలుసుకున్నారు. అందుబాటులో లేని కోర్సుల గురించి అధ్యాపకులతో చర్చించారు. విశాలమైన భవనంలో కళాశాల అందుబాటులో ఉండటంతో పాటు విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధనపై సంతృప్తి చెందారు.

ముప్పారంలో తనిఖీ



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం శివారులో గల కస్తూర్బా గాంధీ పాఠశాలను డీఆర్డీఓ నాగపద్మజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంటగది, వంట సామగ్రి, పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. హెల్త్ క్యాంపును సందర్శించారు. వర్షాకాలం దృష్ట్యా గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీడీఓ అనిల్ కుమార్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రవి



ఆత్మకూరు : బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని పెంచికలపేటకు చెందిన సముద్రాల రవి నియమితులైనట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు అవకాశం కల్పించిన ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గోశాల నిర్మాణానికి భూమిపూజ

దామెర : మండల కేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో గోశాల నిర్మించేందుకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఎర్ర స్వప్న వెంకటరమణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ హింగె నాగేశ్వర్‌రావు గోశాలకు గోవులను అందించినట్లు తెలిపారు. గోశాలను త్వరలో నిర్మించి భక్తులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ట్రస్ట్ సభ్యులు అనిల్‌రెడ్డి, గంగిడి శ్రీధర్ రెడ్డి, ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భిక్షపతి, ఆలయ ప్రధాన అర్చకులు రాజుశర్మ, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడుతూ పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మందికి రూ.17,800 జరిమానా విధించినట్లు వివరించారు.

అనిల్‌కుమార్‌కు ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు

కాజీపేట: ఆంధ్రప్రదేశ్ నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ పోటీల్లో కొమురవెల్లి మల్లన్న జాతరలో పసుపు జాతర అనే అంశంపై తీసిన ఫొటోకు ఉత్తమ ఫొటో అవార్డు దక్కింది. కాజీపేట పట్టణానికి చెందిన పిల్లి అనిల్‌కుమార్ తీసిన చిత్రం ఎంపిక కావడంతో ఆయనను బంధు, మిత్రులు గురువారం సన్మానించారు. వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టంగుటూరి రాజేష్ ఖన్నా పుష్పగుచ్ఛం అందించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలి

కాజీపేట రూరల్: కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న రైల్వే కార్మికుడు పి.నాగరాజు గురువారం మృతి చెందినట్లు రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు తెలిపారు. కాజీపేట నార్త్ ఎస్ఎస్ఈపీ ఇంజినీరింగ్ కార్యాలయం యూనిట్ నంబర్ 1లో సుమారు 36ఏళ్ల పనిచేసి అనారోగ్య కారణాల వల్ల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని రెండు నెలలు అవుతోందని, ఇంకా రైల్వే బెనిఫిట్స్ రాలేదని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల వల్ల సొంత ఇల్లు కూడా లేదని అన్నారు. కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

‘అమ్మ’ పేరుతో మొక్కలు నాటాలి

- డీఆర్డీఓ నాగపద్మజ
- వివిధ మండలాల్లో మొక్కలు నాటిన అధికారులు



ధర్మసాగర్ : మొక్క నాటుతున్న డీఆర్డీఓ నాగపద్మజ

ధర్మసాగర్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, అమ్మ పేరుతో మొక్కను నాటితే కన్నతల్లిని గౌరవించినట్లేనని డీఆర్డీఓ నాగ పద్మజ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అమ్మపేరతో మొక్కను నాటుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సకల జీవరాశులకు ఆశ్రయాన్ని ఇస్తున్న భూ తల్లిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఏపీఓ సంపత్, జెతఈ శ్రీనివాస్, రమేశ్, కరుణాకర్, అధ్యాపకులు ప్రభాకర్, ఆజం, రాములు, సదానందం, రాజేందర్, ఐకేపీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో 'నాటుదాం ఒక చెట్టు -అమ్మ పేరుతో' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉప్పల్‌లో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ వారి అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని, ఆ మొక్క సంరక్షణ బాధ్యత కూడా వారే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి ప్లవన్ మజుందార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏపీఓ రమేశ్, మాజీ సర్పంచ్ దేవేందర్ రావు, మహిళా సంఘాల సభ్యులు, అన్ని శాఖల గ్రామస్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మొక్కలతోనే మానవాళికి మనుగడ అని పంచాయతీ కార్యదర్శి రాజమల్లయ్య అన్నారు. కాట్రపల్లిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ ఇంటి ఖాళీ స్థలంలో ఆరు మొక్కలు నాటాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు



దామెర : మొక్క నాటుతున్న ప్రత్యేక అధికారి బాలరాజు

దామెరలో..

దామెర : మొక్కలు నాటి సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో నాటుదాం ఒక మొక్క- అమ్మ పేరుతో కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, శివంట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, మాజీ ఉపసర్పంచ్ హింగె నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : నాటుదాం ఒక మొక్క అమ్మ పేరుతో కార్యక్రమంలో భాగంగా గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో ఎంపీడీఓ వీరేశం మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ అమ్మపేరుతో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఏపీఎం కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, జీపీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామపంచాయతీలు, పాఠశాలల్లో గురువారం ఈజీఎస్ ఆధ్వర్యంలో నాటుదాం ఒక మొక్క అమ్మ పేరుతో కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఏపీఓ రాజిరెడ్డి, ఈసీ రాము, టీఏలు శ్రీధర్, సురేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : ప్రతిఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం పీచర, మద్దెలగూడెం గ్రామాల్లో మొక్కలు నాటారు. మొక్కల అవశ్యకతను వివరించారు.

రెండో విడత ఫీవర్ సర్వే చేపట్టండి

- మలేరియా, డెంగీ పరీక్షలు చేయండి
- కలెక్టర్ ప్రావీణ్య
- సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



చిన్నారి ఎత్తును పరీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

శాయంపేట: ఇటీవల వర్షాలు కురిసి తగ్గుముఖం పట్టాయని.. రెండో విడత ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్య సిబ్బందిని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌ను గురువారం కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను, మలేరియా, డెంగ్యూ కిట్లను, మెడిసిన్‌ను పరిశీలించారు. రోగులకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. మందుల కోసం ఇండెంట్ ఎలా పెడతారని ప్రశ్నించారు. గర్భిణులు, బాలింతల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. సబ్ సెంటర్ గదికి ఇంటి యాజమానితో మాట్లాడి ప్లాస్టరింగ్ చేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం దళిత కాలనీలోని ఏడో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోడిగుడ్లు, ఆహారం సరఫరా చేసే ట్రాన్స్‌పోర్టర్ నిర్లక్ష్యంతో గుడ్లు సరైన సమయానికి అందడం లేదని, అతడికి నోటీసులిచ్చి సమయానికి అందించేలా చర్యలు తీసుకోవాలని డీడబ్ల్యూఓను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. శాయంపేట మండలానికి 108 కేటాయింపుపై కలెక్టర్‌ను ప్రశ్నించగా.. కమిషనర్‌కు లెటర్ రాస్తామని త్వరలో ఈఎంఆర్ఎస్ ఇన్‌పుట్ చేసి 108 అలాట్ చేస్తారన్నారు. కలెక్టర్ వెంట డీడబ్ల్యూఓ రాజమణి, డీఎంహెచ్ఓ లలిత, సీడీపీఓ స్వాతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీతారెడ్డి, మంజుల, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంపీఓ రంజిత్‌కుమార్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

102 మంది విద్యార్థులు.. ఇద్దరే టీచర్లు

- డిప్యుటేషన్‌పై వచ్చిన మరో ఉపాధ్యాయుడు
- ఇన్నాళ్లు ఉపాధ్యాయుల్లేక ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



కన్నారం ప్రాథమిక పాఠశాల ఇదే..

వేలేరు: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపులు లేకపోవడంతో మెరుగైన విద్య అందే పరిస్థితి కనిపించడం లేదు. మండలంలోని కన్నారం ప్రాథమిక పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలను మించి అన్ని సౌకర్యాలు, వసతులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. కన్నారం ప్రాథమిక పాఠశాలలో గతేడాది 130 మంది విద్యార్థులు ఉండగా.. నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అప్పటికే విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయుల్లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఇక్కడి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు ముగ్గురు ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లగా ఒక్కరు ఉన్నారు. ఆఒకరికి తోడు మరొకరు బదిలీపై వచ్చారు. దీంతో పాఠశాల విద్యార్థులు సుమారు 28 మంది ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు. ఉపాధ్యాయుల్లేక విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళ్తుండడంతో ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులున్నారని మరో ముగ్గురు ఉపాధ్యాయులు కావాలని హెచ్ఎం రాజ్యలక్ష్మి ఉన్నతాధికారులను కోరగా.. గురువారం ఒకరిని డిప్యుటేషన్‌పై పంపించారు. ఆయన శుక్రవారమే వచ్చి విధుల్లో చేరారు. కన్నారం గ్రామం హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో ఉండగా.. పాఠశాలకు ఎంఈఓ మాత్రం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట పరిధిలో ఉంది. దీంతో ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లాలా? ఇక్కడికి రావాలా.. అని తలలు పట్టుకుంటున్నారు. పాఠశాలకు మరో ముగ్గురు ఉపాధ్యాయులను పంపించాలని సిద్దిపేట, హనుమకొండ జిల్లా డీఈఓలను ప్రజలు కోరుతున్నారు. విద్యా వ్యవస్థపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ సంతోశ్ అన్నారు. మండలంలోని పెంచికలపేటలో గురువారం రాత్రి జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి ఆధ్వర్యంలో పలు అంశాలపై నృత్యాలు, నాటికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా, మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ విలియన్, నారాయణ, శ్రీనివాస్, విక్రమ్ రాజ్, రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు : మండల కేంద్రంలో నిర్మిస్తున్న మహిమాన్విత పంచకూట శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శివాలయ నిర్మాణ కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. అనంతరం ఆలయ నిర్మాణ విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తానని అన్నారు. నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి, సభ్యులు బూర కిశోర్‌కుమార్, సిరిపురం సంపత్, రేవూరి జయపాల్‌రెడ్డి, ఉప్పుల సుదర్శన్, పాపని రవీందర్, పలుకల మంజుల, పాపని రూపాదేవిరవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దు’



ధర్నా చేస్తున్న కార్మికులు

హన్మకొండ (పరకాల) : మధ్యాహ్న భోజన నిర్వహణను ప్రైవేటు సేవా సంస్థలకు అప్పగించొద్దని మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పరకాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పోతిరెడ్డి సమ్మక్క మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు నెలకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు రాధమ్మ, కళావతి, కరుణ, తారాబాయి, మమత, శ్రీలత, శైలజ, సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కమలాపూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మానవ శరీర భాగాలు, ప్రభావితమైన రోగాల కారణాలపై డాక్టర్ దుర్గాప్రసాద్ విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజమల్లయ్య ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సఖి సెంటర్ కేస్‌వర్కర్ హరిత

ఎల్కతుర్తి : మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ కేస్ వర్కర్లు హరిత, వినీల సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను వివరించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్, వైద్య సాయం, తాత్కాలిక వసతి, న్యాయ సాయం తదితర సేవలపై అవగాహన కల్పించారు. అత్యాచారాలు, గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు వంటి బాధితులకు రక్షణ కల్పించేందుకు సఖీ సెంటర్ 24 గంటల పాటు పనిచేస్తోందని అన్నారు. బాధిత మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనితాదేవి, ఉపాధ్యాయునులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలి

రైతు రుణమాఫీని ఆంక్షలు లేకుండా వర్తింపజేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్కతుర్తి : రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు



ధర్మసాగర్ : ధర్నా అనంతరం మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి



వేలేరు : ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శాయంపేట : ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఉచిత వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ స్పందన

ఆత్మకూరు : విద్యార్థులు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారిణి స్పందన అన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చదువుపై ఏకాగ్రత వహించి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు రవీంద్ర, సంధ్య, గోపాల్‌రెడ్డి, సీహెచ్ఓ కలీమ్, జునేది, సంపత్‌తో పాటు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కులు అందజేస్తున్న సంపత్

ఎల్కతుర్తి : నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని దండేపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గొలిపెల్లి సంపత్ గురువారం బాధిత కుటుంబాలకు అందించారు. గ్రామానికి చెందిన మహ్మద్ ఆజీజ్‌ఖాన్‌కు రూ. 55,500, మండ రాజన్నకు రూ.30వేలు, బొమ్మిడి రాజిరెడ్డికి రూ.60వేల చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేయడమే కాకుండా అనారోగ్యం బారిన పడిన వారిని ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సేవలను ప్రజలు గుర్తించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం విష్ణువర్ధన్, కట్కూరి శ్రీనివాస్, పప్పుల గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధర్మసాగర్ : అంతర్రాష్ట్ర దొంగలు సంచరిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రవీణ్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఉత్తర భారత్ నుంచి దొంగల ముఠా వచ్చినట్లు తెలిసిందని, పొరుగూరికి వెళ్లే వారు ఇంటికి తాళం వేసి చుట్టుపక్కల వారికి చెప్పి వెళ్లాలని సూచించారు. కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే 8712685127కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

వేలేరులో..

వేలేరు : అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఏ.సురేశ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే 8712685128 లేదా 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు

కమలాపూర్ : ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అంజనీపుత్ర ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సీట్లు పంపిణీ చేశారు. అనంతరం టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు.